క్లుప్తంగా

బాడీ ఫ్రీజర్ వితరణ

పులివెందుల రూరల్ : వేలూరు చిన్న గంగిరెడ్డి, లక్ష్మీదేవి దంపతుల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వేలూరు శ్రీనివాసరెడ్డి పట్టణంలోని స్నేహిత అమృతహస్తం సేవా సమితికి గురువారం బాడీ ఫ్రీజర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

చెన్నూరు : ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతాయని వీఆర్వో రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుజితలు తెలిపారు. గురువారం చెన్నూరులోని సచివాలయం–3 పరిధిలోని కేఓఆర్ కాలనీ, కొత్త గాంధీనగర్, లక్ష్మీనగర్ లలో వలంటీర్లతో పర్యటించి అక్కడి ప్రజలతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామ వలంటీర్లు మీ పరిధిలో ఉన్న 50 ఇళ్లకు సంబంధించి అక్కడి ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని తక్షణం పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ చరణ్, డిజిటల్ అసిస్టెంట్ సమత, మహిళా పోలీస్ వాసవి, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన బోధనను అందించాలని ఎంఈఓ–2 సునీత తెలిపారు. గురువారం ఆమె ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, మండల ప్రధాన కార్యదర్శి వీరనారాయణ, ప్రెసిడెంట్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరికరాలు అందేలా చూడాలి

వేంపల్లె : డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు కావాల్సిన రైతులకు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించి పరికరాలు అందేలా చూడాలని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన వేంపల్లె ఉద్యాన శాఖ కార్యాలయంలో వేంపల్లె, చక్రాయపేట మండలాల వ్యవసాయ శాఖ సిబ్బందికి రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్క రైతుకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని, అలాగే రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఓలు రాజేంద్రప్రసాద్, నవంత్ బాబు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని రాచిన్నాయపల్లె నుంచి రామనపల్లి, ముండ్లపల్లి, ఓబులంపల్లెకి వెళ్లే రహదారికి తారురోడ్డు వేసేందుకు శుక్రవారం జరిగే భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాద్రిపురం : మండలంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 132కె.వి. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నామని ప్రజలు గమనించాలన్నారు.

జూలై 1 నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం

చక్రాయపేట : మండలంలో జూలై 1వ తేదీనుంచి జగనన్న సురక్ష పథకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శివారెడ్డి తెలిపారు. జూలై 1వ తేదీన మారెళ్లమడక, 3న మహాదేవపల్లె, 5న నెర్సుపల్లె, 7న కల్లూరుపల్లె, 10న తేదీన కె.ఎర్రగుడి, 12న కుప్పం, 14న చిలేకాంపల్లె, 18న సురభి–1, 20న సురభి–2, 22న కుమారకాల్వ, 25న చక్రాయపేట సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నామని తెలిపారు. ఆయా తేదీలలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మండల సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఎంపీపీ ఎం.అమృత అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల ప్రగతిపై చర్చ ఉంటుందన్నారు. మండలస్థాయి అన్ని శాఖల అధికారులు నివేదికలతో, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ప్రసన్నకుమార్(56) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డిలు ఆయన ఇంటి వద్దకు వెళ్లి సంతాపం తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



వృద్ధురాలి సమస్యను వింటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హులై ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందలేదన్న మాట ప్రజలనుంచి వినిపించకూడదని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని సంగాలపల్లె, మిట్టపల్లె ఎస్సీ కాలనీ, లింగాల గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాల ద్వారా కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఇంకెవరికైనా పథకాలు అందకుండా ఉంటే తెలియజేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నాడని ప్రజలకు చూసించారు. స్థానికంగా గ్రామాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు తెలిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలు వారి సమస్యలను గ్రామంలో పరిష్కరించు కొనేందుకు వీలు కల్పించారన్నారు. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెల్లవలసి వచ్చేదని ప్రస్తుతం అటువంటి వాటికి స్వస్తి చేప్పి గ్రామ స్థాయిలోనే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్య, మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, వెలుగు ఏపీఎం భాగ్యమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, పీఆర్ ఏఈ మల్లారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, గంగిరెడ్డిపల్లె మాజీ ఎంపీటీసీ రవి, స్థానిక నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్

వేంపల్లె : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్డీఏ పీడీ ఆనంద్ యక్ తెలిపారు. గురువారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ సంఘానికి మండల సమాఖ్యకు ఒక విజన్ ఉండాలని.. దాన్ని సాకారం చేసుకోవడానికి ప్రయత్నం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే ప్రతి పథకం సద్వినియోగం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ప్రతి సభ్యురాలు తప్పకుండా ఒక సుస్థిర జీవనోపాధి కలిగి ఉండాలని.. ముఖ్యంగా పాడి పరిశ్రమ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ద్వారా జగనన్న పాల వెల్లువలో భాగంగా అన్ని గ్రామాల్లో పాల కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దళారుల బారినపడి మోసపకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన పాల కేంద్రాలలో పాలు పోసి అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐబీ డీపీఎం హరిప్రసాద్ రాజు, ఆర్పీలు శైలజ, వెంకటేశ్వరరావు, ఏపీఎంలు, వీఓలు, లీడర్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ డంపుల గుర్తింపు



పగడాలపల్లె వద్ద నిల్వ చేసిన ఇసుక డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్

పెండ్లిమర్రి : మండలంలోని పెండ్లిమర్రి, పగడాలపల్లె గ్రామాల్లో అక్రమంగా ఇసుక డంపులు ఉన్నట్లు సమాచారం రావడంతో గురువారం తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక నిల్వలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇసుక డంపు చేసిన వారిని గుర్తించి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న డీఎస్పీ షరీఫ్

వీరపునాయునిపల్లె : గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కడప డీఎస్పీ షరీఫ్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్‌లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేసి రౌడీ షీటర్ కేసు పొడిగిస్తామన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యబాబు, ఎస్‌ఐ లక్ష్మినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గదుల ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి

వేంపల్లె : జిల్లా పరిషత్ సముదాయ గదుల ఏర్పాటుకు వేంపల్లెలో స్థలాన్ని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డిలతో కలిసి ఆయన నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న జెడ్పీ క్లాంపెక్స్ వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అందుకు సంబంధించి పంచాయతీ సైట్ ఇంజనీర్ శ్రీనివాసులుతో కొలతలు వేయించి ఎన్ని గదులు నిర్మించాలనే దానిపై ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్తూరు రెడ్డయ్య, ఆర్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు



ఖైదీల రక్తనమూనాలను పరిశీలిస్తున్న ఖాదర్‌వల్లీ, కేంద్రకారాగార సూపరింటెండెంట్ ప్రకాష్

కడప అర్బన్: ఖైదీలందరికీ వైద్య పరీక్షలు చేయడంతో పాటు.. వారి దీర్ఘకాలిక వ్యాధులపట్ల అవగాహన కల్పించామనీ జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.కే ఖాదర్‌వల్లీ అన్నారు. గురువారం కడప కేంద్రకారాగారం ఆవరణంలో వైద్య పరీక్షలలో భాగంగా రక్తనమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కారాగారంలోని ఖైదీలందరికీ హెపటైటిస్–బి, సి, సిఫిలిస్, టి.బి. హెచ్.ఐ.వి తదితర వ్యాధులకు రక్త నమూనాలను సేకరించి, పరీక్షించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా కడప కేంద్రకారాగార సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఆరునెలలకు ఒకసారి ఖైదీల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయిస్తామన్నారు. కడప కేంద్రకారాగారం వైద్యాధికారిణి డాక్టర్ పుష్పలత,సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ ప్రవీణ్, సుదర్శన్ రెడ్డి ఖైదీలలో వున్న వ్యాధి నిర్ధారణలు కనుగొని, వారికి తగిన జాగ్రత్తలు తీసుకుని వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్, ఉప పర్యవేక్షణాధికారి జవహర్‌బాబు పాల్గొన్నారు.

సైన్స్ అవార్డుల రద్దు దేశ ప్రగతికి అడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

కడప కల్చరల్ : సైన్స్ అవార్డులను రద్దు చేయడం దేశ ప్రగతిని అడ్డుకోవడమేనని, శాస్త్ర పురోగతిని భంగ పరిచినట్లని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు సైన్స్, హెల్త్ రంగాలలో అవార్డులను నిలిపివేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి తీసుకున్న నిర్ణయం సరికాదని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువ శాస్త్రవేత్తలకు అంతర్జాతీయ హోదా గల శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు ఇచ్చే 72 అవార్డులను వారు తమ రంగాలలో చేసిన కృషికి కనీస గుర్తింపు ఇవ్వడమేనని, ఇలా ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. వాటిని రద్దు చేయడం ద్వారా శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాగేసుకుని తాను చెప్పినట్లు వినే కీలు బొమ్మలను చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అని విమర్శించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు బాల బయన్న పాల్గొన్నాడు.

'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ సచివాలయ పరిధిలోని పైడికాలువ, సీతోరుపల్లె, జంగంపల్లె గ్రామాలలో శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తున్న వారి ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచారని.. ఈ మేరకు జాప్యం జరిగిన కాలానికి అర్హతగల సెలవులు మంజూరు చేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ రాఘవరెడ్డిని ఎస్టీయూ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, ఆదినారాయణరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, సునీల్‌కుమార్,సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి డీఈఓను కలిసిన వారిలో ఉన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీని కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను తొలగించడం సరికాదని.. వారినే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు, నగర కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం కడప డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడెనిమిదేళ్లగా పనిచేస్తున్న తమను ఉన్న ఫలంగా తీసివేస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.చిన్నచౌక్ పోలీసులు ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్లారు.

11 మంది అరెస్ట్

కడప అర్బన్: కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 19న కొండాయపల్లి సమీపంలో పెప్సీ గోడౌన్‌పై దాడి కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. షేక్ మహబూబ్ తాజుద్దీన్, సలీం, షేక్ ఖాజా, బాలరాజు, వీరవంశీ, రాజేష్, తాజ్‌బాబా, రియాజ్, మౌలాలి, షావల్లీ, పీరుల్లాలను అరెస్ట్ చేశారు. నిందితులలో ప్రధానంగా వెంకటేశ్వర్ నాయుడు, ఓ టి.వి ఛానెల్ కడప టౌన్ రిపోర్టర్ (సాక్షి కాదు), ఇంకా కొంతమంది ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డిగ్రీలో సింగిల్ సబ్జెక్ట్ మేజర్ సబ్జెక్టు విధానం రద్దు చేయాలని, త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభించి 20 రోజులు పూర్తవుతున్న నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అధ్యాపక, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు సునీల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వేలం

కడప కోటిరెడ్డిసర్కిల్: తహసీల్దార్ కార్యాలయంలోని పాత చెక్కలతో చేసిన ద్వార బందాలు, పలకలు, కిటికీ రెక్కలు, చెక్క దూలాలు తదితర సామాగ్రి వేలం పాట ద్వారా విక్రయించాలని నిర్ణయించామని కడప తహసీల్దార్ శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 24న ఉదయం 11 గంటలకు కార్యాలయంలో హాజరై రూ. 1000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. ఏదైనా కారణం చేత వేలం నిలపుదల చేసేందుకు తహసీల్దార్‌కు అధికారాలు ఉంటాయని పేర్కొన్నారు. వేలం పాటకు ప్రారంభానికి 30 నిమిషాల ముందు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మతసామరస్యంతో పండుగలు నిర్వహించాలి

బద్వేలు అర్బన్ : పండుగలను మతసామరస్యంతో, భక్తిభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో హిందూ, ముస్లిం మతపెద్దలతో గురువారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు, మతపెద్దలు పోలీసులకు సహకరించాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



ఐస్ ఫ్యాక్టరీ యాజమానులకు అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి

చెన్నూరు : బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని వారిని పనిలో పెట్టుకుంటే ఆయా సంస్థల యజమానులపై కేసులు నమోదు చేస్తామని కార్మికశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని దుకాణాల వద్దకు వెళ్లి దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండని పిల్లలను పనిలో పెట్టుకోకూడదని అలా చేయడం నేరమన్నారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జులై 1 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. అందులో భాగంగా గురువారం చెన్నూరులో పాత రోడ్డు మీద నుంచి కొత్త రోడ్డు మీదివరకు అన్ని షాపులను, హోటళ్లు, ఇటుకల బట్టీలు, ఐస్ ఫ్యాక్టరీలు వద్దకు వెళ్లి లేబర్ యాక్ట్ గురించి అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు చంద్రకళ, లీలారాణి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని నీటి సరఫరా మస్టర్ పాయింట్‌ను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అక్రమ కొళాయి కనెక్షన్లను వందశాతం రెగ్యులర్ చేయించే విషయంలో సిబ్బంది ఆశించిన రీతిలో పనిచేయకపోతే వారి జీతాలు సైతం నిలుపుతామన్నారు. అనంతరం వారు వార్డులలో పర్యటించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పురుగు మందులు విక్రయించాలి



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ, సీఐ, తదితరులు

వేముల : మండల వ్యాప్తంగా రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు విక్రయించాలని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. గురువారం స్థానికంగా ఉన్న తేజేశ్వర ఫర్టిలైజర్స్ షాపును సీఐ గోవిందురెడ్డి, ఎస్ఐ ధనుంజయుడులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ఎటువంటి నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లు రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులను, పురుగు మందులను అధిక రేట్లకు విక్రయించకుండా ఎమ్మార్పీ రేట్లకు ఇవ్వాలన్నారు. పురుగు మందులు, ఎరువులకు సంబంధించిన ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. షాపులోని అన్ని రకాల పురుగు మందులను స్టాక్ రిజిష్టర్ వారు తనిఖీ చేశారు.

ఆడపిల్లలపై వివక్ష చూపరాదు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

తొండూరు : ఆడపిల్లపై వివక్ష చూపరాదని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన తొండూరు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో భేటీ బచావో.. భేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అక్రమ భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమన్నారు. తహసీల్దార్ బాల నరసింహులు మాట్లాడుతూ స్కానింగ్ ద్వారా ఆడపిల్ల అని తెలుసుకుని గర్భస్రావం చేయించడం చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లలను ఎదగనిద్దాం.. ఆడపిల్లలను చదువునిద్దామన్నారు. మండల నోడల్ అధికారిణి రమణమ్మ మాట్లాడుతూ ప్రజలలో లింగ వివక్ష నిర్మూలన చట్టం గురించి అవగాహన కల్పించాలి. అనంతరం సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రమణ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు అందించాలి

ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి

వేముల : పంటల సాగులో అర్హులైన రైతులకు డ్రిప్ పరికరాలు అందేలా చూడాలని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి సూచించారు. గురువారం ఆయన స్థానిక రైతు భరోసా కేంద్రంలో వీఏఏలు, వీహెచ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది డ్రిప్ ఇరిగేషన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు సిబ్బంది పనిచేయాలన్నారు. గ్రామాల్లో డ్రిప్ పరికరాలపై రైతులకు అవగాహన కల్పించి వారు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది 11వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సిబ్బంది రైతులతో మాట్లాడి సకాలంలో డీడీలు చెల్లించేలా చూడాలన్నారు. అంతేకాక రిజిస్టర్ చేయించిన తర్వాత నాన్ సబ్సిడీ అమౌంట్ త్వరగా రైతులతో కట్టించేలా చూడాలన్నారు. అనంతరం ఏడీఏ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా వేముల మండలంలో 450 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఆయా రైతులతో మాట్లాడి ఈకేవైసీ చేయించినట్లయితే వీరి ఖాతాలలో 14వ విడత పీఎం కిసాన్ అమౌంట్ జమ అవుతుందన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రానికి 50 మట్టి నమూనాలను లక్ష్యంగా ఇచ్చారని.. త్వరగా మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, ఆయా ఆర్‌బీకేల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.